క్లుప్తంగా

ముస్లింలకు జకియా ఖానం ద్రోహం


మాహిన్

పుత్తూరు: శాసన మండలి డిప్యూటీ చైర్‌పర్సన్ జకియా ఖానం బీజేపీలో చేరడం అవకాశవాద రాజకీయాలకు పరాకాష్ట అని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర మైనారిటీ సెల్ కార్యదర్శి మాహిన్ గురువారం ఆరోపించారు. వైఎస్ కుటుంబానికి ఎంతో సన్నిహితంగా మెలిగిన అఫ్జల్ అలీఖాన్ మరణంతో ఇంట్లో ఉన్న ఆమెను ఎమ్మెల్సీని చేసి తర్వాత మండలి డిప్యూటీ చైర్‌పర్సన్ పదవి ఇచ్చి గౌరవిస్తే ఆమె ఇలా వెన్నుపోటు పొడవడం బాధాకరమన్నారు. దేశ వ్యాప్తంగా ముస్లిం సమాజానికి వ్యతిరేకంగా నల్ల చట్టాలను తెచ్చి వారిపై విషం చిమ్ముతున్న మతతత్వ పార్టీ బీజేపీలో చేరడం వైఎస్సార్‌సీపీకి, ముస్లిం జాతి మొత్తానికి తీరని ద్రోహం చేసినట్లేనన్నారు.

నూతన వధూవరులకు ఆశీర్వాదం


వధూవరులను ఆశీర్వదిస్తున్న మాజీ డిప్యూటీ సీఎం నారాయణస్వామి

శ్రీరంగరాజపురం: మండల పరిధిలోని పుల్లూరు గ్రామానికి చెందిన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకుడు సుబ్రమణ్యం కుమారుడి వివాహ వేడుకల్లో రాష్ట్ర మాజీ ఉప ముఖ్యమంత్రి కళత్తూరు నారాయణస్వామి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన నూతన వధూవరులను ఆశీర్వదించారు.

ఆరోగ్యానికి వరం.. ప్రకృతి వ్యవసాయం


ప్రకృతి వ్యవసాయ అధికారులను సన్మానిస్తున్న సర్పంచ్ కుసుమ

పెనుమూరు(కార్వేటినగరం): ఆరోగ్యానికి వరం.. ప్రకృతి వ్యవసాయమని, ప్రతిఒక్కరూ ప్రకృతి వ్యవసాయం చేయాలని పెనుమూరు మండలం ప్రకృతి వ్యవసాయ విభాగం అధికారి హనుమంతు అన్నారు. గురువారం మండలంలోని తిరువీరరెడ్డిపల్లి, గుంటిపల్లి పంచాయతీలలో ఖరీఫ్ వార్షిక ప్రణాళిక కార్యక్రమం ర్యాలీ, అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయం వల్ల ఆరోగ్యకరమైన ఆహార ఉత్పత్తులు అందించవచ్చన్నారు. నవధాన్యాలు, బహుళ పంటలు, పెరటి తోటలు వేసుకుని రైతులు లబ్ధి పొందాలని సూచించారు. అనంతరం ప్రముఖ అభ్యుదయ రైతు హరికృష్ణారెడ్డి మాట్లాడుతూ విష రసాయనాల వల్ల భూమి సారవంతం పోవడమే కాకుండా తమ ఉత్పాదకతను కోల్పోతుందన్నారు. పర్యావరణ పరిరక్షణకు, కాలుష్య నివారణకు మానవ మనుగడకు ప్రకృతి వ్యవసాయమే శరణ్యమని సూచించారు. అనంతరం ప్రకృతి వ్యవసాయ అధికారులను సర్పంచ్ కుసుమ సన్మానించారు. సంఘమిత్ర అనురాధ పాల్గొన్నారు.

మినీ అంగన్‌వాడీలకు వేసవి సెలవులు ఇవ్వాలి

చిత్తూరు కలెక్టరేట్: రాష్ట్ర ప్రభుత్వం మినీ అంగన్‌వాడీలకు వేసవి సెలవులు ఇవ్వాలని గురువారం సీఐటీయూ జిల్లా గౌరవాధ్యక్షుడు గంగరాజు ఐసీడీఎస్ పీడీ వెంకటేశ్వరికి వినతి పత్రం ఇచ్చారు. ఆయన మాట్లాడుతూ, రాష్ట్రంలో ఎండలు తీవ్రత రోజురోజుకూ పెరుగుతోందని, అన్ని విద్యాసంస్థలకు సెలవులు ఇచ్చినప్పటికీ అంగన్‌వాడీ సెంటర్లకు సెలవులు ఇవ్వకపోవడం దారుణమన్నారు.

ఆహా ఏమి రుచి..

తినరా మైమరచి!

- ఆర్గానిక్ మామిడికి భలే డిమాండ్
- సేంద్రియ వ్యవసాయంపై రైతుల మొగ్గు
- ఆరోగ్యకర పంటల సాగుపై దృష్టి



కాకవేడులో సేంద్రియ పద్ధతిలో సాగుచేసిన బేనిషా చెట్టు, రసాయనాలు వాడక సాగుచేసిన మామిడి కాయలు

నగరి: ప్రపంచీకరణ నేపథ్యంలో మంచి నాణ్యతగల వ్యవసాయోత్పత్తులకు ఎగుమతి అవకాశాలతోపాటు అధిక డిమాండ్ పలుకుతున్నాయి. నాణ్యత లోపించి, పోషక విలువలులేక అధిక దిగుబడులు రావాలంటూ పండిస్తున్న వ్యవసాయోత్పత్తులు తయారవడానికి కారణం సంప్రదాయ వ్యవసాయ పద్ధతులకు నీళ్లొదిలి నాసిరకపు పద్ధతులను అనుసరించడమే అని రైతులు తెలుసుకుంటున్నారు. వ్యవసాయంలో రసాయనాలకు స్వస్తి పలికి ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహించడం ద్వారా నేలతల్లి ఆయుష్షును పెంచడంతోపాటు నేల తల్లిని కాపాడుకోవడానికి, ఆరోగ్యాన్ని పరిరక్షించేందుకు ప్రతిఒక్కరూ ముందుకు రావాల్సిన సమయం ఆసన్నమైందని తెలుసుకుని రసాయనిక ఎరువులకు బదులుగా సేంద్రియ ఎరువులు, పురుగుల మందులకు బదులుగా ప్రకృతిలో దొరికే ఆకుల కషాయాలను వాడుతూ పండించే పంటకు మార్కెట్‌లో మంచి డిమాండ్ పలుకుతోంది. ఆరోగ్యకరమైన పంటకు ప్రజలు ప్రాధాన్యత ఇస్తున్నారు.

ఆర్గానిక్ మామిడి పండ్లపై ఆసక్తి

మార్కెట్‌లో రసాయనాలు వాడి పండించిన మామిడి నిఘనిఘలాడుతూ కనిపిస్తున్నా అవి కాల్షియం కార్బైడ్‌తో మాగబెట్టిన పండ్లు కావడంతో కొనుగోలు చేసుకోవడానికి సంశయిస్తున్నారు. పక్వానికి రాని మామిడిపండ్లు, గాలికి రాలిన మామిడి పండ్లను సైతం రసాయనాల ద్వారా మాగనిచ్చి మార్కెట్‌లో చౌకగా అమ్మకాలకు ఉంచుతున్నారు. ఇవి పైకి మాగినట్లు కనిపించినా లోపల అపరిపక్వంగా ఉండి రుచి పుల్లగా ఉంటుంది. ముక్కు దగ్గరగా ఉంచుకున్నప్పుడు మాత్రమే పండు వాసన వస్తుంది. పండు త్వరగా చెడిపోతుంది. వీటిని తింటే ఆరోగ్యానికి హానికరమంటూ వ్యవసాయ అధికారులు, వైద్యులు హెచ్చరిస్తున్నారు. దీంతో పలువురు రసాయనాలు వాడక సేంద్రియ పద్ధతిలో సాగుచేయడంతోపాటు వాటిని ఎలాంటి రసాయనాలు లేకుండా కసువు వేసి మాగనిచ్చే మామిడి పండ్లకే ప్రాధాన్యత ఇస్తున్నారు. కాస్త ధర ఎక్కువైనా ఆరోగ్యం ప్రధానమంటూ ఆర్గానిక్ మామిడి పండ్లు కొనుగోలు చేసుకోవడానికి ఆసక్తి చూపుతున్నారు. తినే సమయాల్లో ఈ పండ్లు ఇచ్చే రుచి ఆర్గానిక్ పండ్లు అంటే ఇవిరా అన్నట్లు అందరినీ ఆకట్టు కుంటున్నాయి.

నియోజకవర్గంలో సేంద్రియ వ్యవసాయం ఇలా..

నియోజకవర్గంలో 40 ఎకరాల్లో మామిడి సేంద్రియ పద్ధతిలో సాగవుతోంది. నగరి మండలంలోని కాకవేడు, గుండ్రాజుకుప్పం, రాజులకండ్రిగ ప్రాంతాల్లో సాగుచేస్తున్నారు. కూరగాయలు నగరి, నింద్ర, విజయపురం మండలాల్లో 40 ఎకరాల్లో సాగవుతోంది. ఇప్పటికే వ్యవసాయ అధికారులు పెట్టుబడి లేని ప్రకృతి వ్యవసాయంపై రైతులకు అవగాహన కల్పిస్తుండడం, ఇతర సందేహాలకు స్థానికంగానే ఉన్న రైతు సేవా కేంద్రాలు వారికి సలహాలు ఇస్తూ రైతుకు ధైర్యాన్ని ఇస్తోంది. వేలల్లో ఖర్చయ్యే ఎరువులకు, పురుగుల మందులకు స్వస్తి పలికి స్వంతంగా కషాయాలను తయారుచేసుకుంటున్నారు. పంచగవ్య, బ్రహ్మాస్త్రం, ఆగ్నాస్త్రం, నీమాస్త్రం, ఘనజీవామృతం, ద్రవజీవామృతం, కంపోస్టు, వేపపిండి, జనుము లాంటివి వాడుకుంటున్నారు. ఈ పద్ధతిలో సాగుచేయడం ద్వారా భూసారం కోల్పోవడం జరగదని, దిగుబడి ఎక్కువగా వస్తుందని రైతులు తెలుపుతున్నారు. వీటి వాడకం వల్ల భూసారం పెంచే వానపాములు తయారవుతాయని అంటున్నారు. ఈ పద్ధతిలో పండించిన పంటల్లోనూ వ్యత్యాసం ఉంటోందన్నారు. పంటల కొనుగోళ్లకు కూడా మార్కెట్లో చొరవచూపుతున్నారంటున్నారు. రసాయనాలు వాడే పంటకన్నా ఈ పద్ధతిలో పండించే పంట ఆరోగ్యకరమంటున్నారు.



కాకవేడులో సాగుచేస్తున్న చెందూరా చెట్టు, కసువు, పేపర్‌ముక్కలు వేసి మాగనిస్తున్న మామిడి కాయలు

> **ప్రకృతి సిద్ధమైన ఎరువుల పండు రుచే వేరు..**
> రసాయనాలు లేకుండా ప్రకృతి సిద్ధమైన ఎరువులతోనే పండించే పండ్లు రుచిలోనే తేడా తెలుస్తుంది. పండ్లు వారం రోజులకుపైగా బయటే ఉంచినా వాడిపోవు. అదే రసాయనాలు వాడి సాగుచేసే పండ్లు ఫ్రిజ్‌లో లేకున్నా చెడిపోతాయి. కాయలు పండించడానికి రసాయనాలు వాడాల్సిన అవసరం లేదు. కసువు, పేపర్ ముక్కలు ఉంటే మాగిపోతుంది. –వెంకటరత్నం, రైతు కాకవేడు


రసాయనాలు వాడని మామిడికాయలు చూపుతున్న రైతు వెంకటరత్నం

కోలాహలం.. గంగమ్మ జాతర


అలంకరణలో గంగమ్మదేవి

నింద్ర: మండలంలోని మిట్టూరు గ్రామంలో గురువారం గంగమ్మ జాతర కోలాహలంగా నిర్వహించారు. ఉదయం అమ్మవారికి అంబలి పోశారు. మధ్యాహ్నం అమ్మవారికి గ్రామస్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం అమ్మవారి విగ్రహాన్ని గ్రామంలో ఊరేగించారు. ఈసందర్భంగా గ్రామస్తులు కర్పూర హారతులు ఇచ్చి మొక్కులు తీర్చుకున్నారు.

వేడుకగా ద్రౌపదీ తిరునాళ్ల


ప్రత్యేక అలంకరణలో ధర్మరాజు

నింద్ర: మండలంలోని అత్తూరు గ్రామంలో జరుగుతున్న ద్రౌపదీ తిరునాళ్లలో భాగంగా గురువారం పురవీధుల్లో ధర్మరాజు విగ్రహాన్ని ఊరేగించారు. ఉదయం గ్రామస్తులు అమ్మవారి ఆలయం వద్ద ప్రత్యేక పూజలు చేసి అభిషేకాలు, అర్చనలు చేశారు. సాయంత్రం ధర్మరాజు విగ్రహాన్ని ప్రత్యేక పూలతో అలంకరించి పురవీధుల్లో ఊరేగించారు. భక్తులు కర్పూర హారతులు పట్టి మొక్కులు తీర్చుకున్నారు.

క్రీడలతో శారీరక, మానసిక వికాసం

- జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ

యాదమరి: క్రీడలు విద్యార్థుల శారీరక, మానసిక వికాసానికి దోహదం చేస్తాయని, విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ సత్తా చాటాలని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీఅన్నారు. గురువారం మండలంలోని పీఈఎస్ పబ్లిక్ పాఠశాలలో పదవ సబ్ జూనియర్స్ ఇంటర్ డిస్ట్రిక్ చాంపియన్‌షిప్ బాస్కెట్ బాల్ పోటీలను జిల్లా కలెక్టర్, పూతలపట్టు ఎమ్మెల్యే కె.మురళీ మోహన్, డీఎఫ్ఓ భరణి ప్రారంభించి మాట్లాడారు. క్రీడల్లో గెలుపోటములు సహజమని, క్రీడా స్ఫూర్తితో ఆడాలన్నారు. ఈ పోటీలు నాలుగు రోజులపాటు నిర్వహించనున్నట్టు నిర్వాహకులు తెలిపారు

శాస్త్రోక్తంగా గురు సంక్రమణ పూజలు


ప్రత్యేక అలంకరణలో దక్షిణామూర్తి

నగరి: స్థానిక కామాక్షీ సమేత కరకంతేశ్వర ఆలయంలోని దక్షిణామూర్తి సన్నిధిలో గురువారం గురుసంక్రమణ పూజలు శాస్త్రోక్తంగా జరిగాయి. నవ గ్రహాల్లో పంచమ గ్రహం అయిన గురువు ద్వాదశ రాశుల్లో ఒక దాని నుంచి మరో రాశికి మారే సమయాన్నే గురు సంక్రమణంగా ఆరాధిస్తారు. నవగ్రహాల్లోనే అత్యంత శుభగ్రహంగా భక్తులు పూజించే గురు గ్రహానికి అధిపతిగా దక్షిణామూర్తిని పూజిస్తారు. ఏటా గురువురాశి మారే క్రమంలో విశేషంగా గురు సంక్రమణ పూజలు నిర్వహిస్తుంటారు. ఇందులో భాగంగా గురువారం గురు భగవానుడు వృషభ రాశి నుంచి మిథున రాశికి సంక్రమించడాన్ని పురస్కరించుకుని ఆలయంలోని గురుదక్షిణామూర్తికి ప్రత్యేక అభిషేక పూజలు నిర్వహించారు. ముందుగా ఆలయాన్ని మంత్ర జలాలతో శుద్ధిచేశారు. అనంతరం దక్షిణామూర్తిని వివిధ ద్రవ్యాలతో అభిషేకించారు. అనంతరం దక్షిణామూర్తి విశేష అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. వేదమంత్రోచ్చరణలు, మేళతాళాల మధ్య ధూప దీప, నైవేద్యాలు, హారతులు సమర్పించారు. విశేష ఉత్సవాన్ని భక్తులు కనులపండువగా తిలకించారు. ఆలయ ధర్మకర్త సుబ్రమణ్యం ఏర్పాట్లు పర్యవేక్షించారు. అర్చకులు దుర్గాప్రసాద్ సంక్రమణ పూజలు నిర్వహించారు.

ముగిసిన గంగమ్మ కొలుపు



ప్రత్యేక అలంకరణలో అమ్మవారు, అమ్మవారి ఊరేగింపులో నృత్యాలు చేస్తున్న యువత

పాలసముద్రం: మండలంలోని కృష్ణజమ్మపురం పంచాయతీ బలిజకండ్రిగ గ్రామంలో వెలసిన చెవుటి గంగమ్మ ఆలయంలో గురువారం కొలుపు మహోత్సవం ఘనంగా ముగిసింది. ఉదయం ఆలయ అర్చకులు అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. మధ్యాహ్నం అమ్మవారికి కాపు కట్టిన భక్తులు తొమ్మిది బావుల్లో నుంచి నీటిని తెచ్చి అమ్మవారికి అభిషేకాలు చేశారు. సాయంత్రం అమ్మవారి ఉత్సవమూర్తిని బెంగళూరు నుంచి తీసుకొచ్చిన ప్రత్యేక పుష్పాలతో సుందరంగా అలంకరించి పురవీధుల్లో ఊరేగించారు. అమ్మవారి కొలుపు ముగింపు కార్యక్రమానికి స్థానిక భక్తులతో పాటు కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల నుంచి పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

ప్రతి ఇంటికీ మరుగుదొడ్డి తప్పనిసరి


కార్వేటినగరంలోని మూల హరిజన వాడలో మరుగుదొడ్డిని పరిశీలిస్తున్న అధికారులు

కార్వేటినగరం: ప్రతి ఇంటికీ వ్యక్తిగత మరుగుదొడ్డి అవసరమని ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ సతీష్‌కుమార్ అన్నారు. గురువారం ఆర్‌డబ్ల్యూఎస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. స్వర్ణాంధ్ర- స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా గ్రామాల్లో పరిశుభ్ర వాతావరణం నెలకొల్పేందుకు ప్రభుత్వం కృషిచేస్తోందన్నారు. ప్రతి ఒక్కరూ వ్యక్తిగత మరుగుదొడ్లు ఏర్పాటు చేసుకుని వినియోగించాలని సూచించారు. మరుగుదొడ్ల నిర్మాణానికి రూ.15 వేల నిధులను రెండు విడతలుగా లబ్ధిదారుల ఖాతాల్లో జమచేస్తామని అని అన్నారు. ప్రతిఒక్కరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని ప్రతి ఇంటికీ మరుగుదొడ్ల నిర్మాణం చేసి వినియోగంలోకి తీసుకురావాలని కోరారు. ఇతర వివరాలకు మండలంలోని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈలను సంప్రదించాలని 9100121842 (కార్వేటినగరం), 9100121843(శ్రీరంగరాజపురం), 9100121844 (వెదురుకుప్పం) నంబర్లలో సంప్రదించి దరఖాస్తు చేసుకోవాలని ఆయన ఈసందర్భంగా అన్నారు. ఆయన వెంట ఏఈ గిరీష్, ఇంజినీరింగ్ అసిస్టెంట్ చాముండేశ్వరి, స్వచ్ఛభారత్ కో-ఆర్డినేటర్ ఏకాంబరం ఉన్నారు.

ప్రభుత్వ భూమి స్వాధీనం


వివరాలు సేకరిస్తున్న తహసీల్దార్ వెంకటేశ్వర్లు

పుత్తూరు: కలెక్టర్ ఆదేశాలతో స్థానిక రెవెన్యూ సిబ్బంది గురువారం సాయంత్రం పుత్తూరు రూరల్ మండలం గట్టు గ్రామంలో సర్వే నిర్వహించి ప్రభుత్వ భూమిని స్వాధీనం చేసుకున్నారు. గ్రామ కంఠం సర్వే నంబర్.60లో 7.30 ఎకరాల భూమిని సర్వే చేసి ప్రభుత్వ భూమిగా తహసీల్దార్ వెంకటేశ్వర్లు ప్రకటించారు. ఇందులో గతంలో ఎవరికి ఎంత మేరకు అనుభవంలో ఉన్న విషయాన్ని పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. అలాగే సర్వే నంబర్ 59–5లో గల 76 సెంట్ల భూమిలోని చెట్లను నరికి 20 టన్నుల కలపను అపహరించిన వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయించి చర్యలు తీసుకుంటామన్నారు.

వర్క్ ఆర్డర్ క్లోజ్ చేయకపోతే రిలీవ్ చేస్తా

చిత్తూరు కార్పొరేషన్: పెండింగ్‌లో ఉన్న వర్క్ ఆర్డర్లను క్లోజ్ చేయకపోతే ఏఈలను రిలీవ్ చేస్తానని ట్రాన్స్‌కో ఎస్ఈ ఇస్మాయిల్ అహ్మద్ హెచ్చరించారు. గురువారం చిత్తూరు అర్బన్, రూరల్ డివిజన్ కార్యాలయాల్లో వేర్వేరుగా అధికారులతో సమీక్షించారు. పైపల్లె, ఐరాల, యాదమరి, రెడ్డిగుంట సెక్షన్ల ఏఈలు ఒక్కొక్కరు రూ.6 కోట్ల మేరకు విలువైన 200 వర్క్ ఆర్డర్లు పెండింగ్‌లో పెట్టుకున్నారని, మెటీరియల్ కొరతతో వ్యవసాయ సర్వీసులు విడుదల చేయలేకపోయామన్నారు. ప్రస్తుతం జిల్లా స్టోర్స్‌లో మెటీరియల్ వచ్చినా క్షేత్రస్థాయిలో సర్వీసుల ఎందుకు ఇవ్వడం లేదని ప్రశ్నించారు. చిత్తూరు అర్బన్‌లో 900, రూరల్స్‌లో 400, పుంగనూరు డివిజన్‌లో 1900 సర్వీసులు పెండింగ్‌లో ఉన్నాయని మండిపడ్డారు. కార్వేటినగరంలో సర్వీసుల విడుదలలో జాప్యం చేస్తున్నారని, గ్రీవెన్స్‌లను సకాలంలో పరిష్కరించాలన్నారు.

పాలిసెట్‌లో పుత్తూరు విద్యార్థుల ప్రతిభ


మాట్లాడుతున్న ప్రిన్సిపల్ ఎస్వీ కుమార్

పుత్తూరు: పాలిసెట్ పరీక్ష ఫలితాల్లో పుత్తూరుకు చెందిన పిళ్లారిపట్టు ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో శిక్షణ పొంది పరీక్షకు హాజరైన ప్రతి విద్యార్థి ఉత్తీర్ణత సాధించినట్లు కళాశాల ప్రిన్సిపల్ ఎస్వీ కుమార్ తెలిపారు. గురువారం కళాశాలలో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థుల అభినందన సభ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కళాశాలలో మొత్తం 90 మంది ఉచిత శిక్షణ తీసుకోగా, పరీక్షకు 65 మంది హాజరవగా అందరూ ఉత్తీర్ణత సాధించడం సంతోషకరమన్నారు. ఇందులో ఐదుగురు విద్యార్థులు రాష్ట్ర స్థాయిలో మంచి ర్యాంకు సాధించడం కళాశాలకు గర్వకారణమని తెలిపారు. వెబ్ కౌన్సెలింగ్, వెబ్ ఆప్షన్ తేదీలను రాష్ట్ర సాంకేతిక శాఖ త్వరలోనే ప్రకటిస్తుందని తెలిపారు. పుత్తూరుతో పాటు నగరి, నారాయణవనం, వడమాలపేట, కార్వేటినగరం విద్యార్థులకు తమ కళాశాల ఎంతో సౌకర్యవంతంగా ఉంటుందని తెలిపారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

వేణుగోపాలుడి ఉత్సవాలకు వేళాయే..!


దక్షిణ ఆసియాలోనే అతి పెద్ద స్కంధ పుష్కరిణి

- 18న అంకురార్పణతో బ్రహ్మోత్సవాలు ప్రారంభం
- 14 ఎకరాల్లో అతి పెద్ద స్కంధ పుష్కరిణి

కార్వేటినగరం: వేణుగోపాలస్వామి ఆలయంలో మే 19వ తేదీ నుంచి వార్షిక బ్రహ్మోత్సవాలు ప్రారంభమవుతాయని టీటీడీ ఆలయ అధికారి సురేష్‌కుమార్ తెలిపారు. పది రోజుల పాటు జరిగే ఈ ఉత్సవాల్లో స్వామివారు రోజుకో అవతారంలో వివిధ వాహనాలపై పురవీధుల్లో విహరిస్తారని చెప్పారు. మే 18వ తేదీ ఆదివారం ఉదయం మాఢ వీధుల్లో వెలసిన ఆంజనేయస్వామికి వేదపండితులు వేద మంత్రాల నడుమ అభిషేకం నిర్వహిస్తారు. సాయంత్రం అంకురార్పణ, 19న సోమవారం 9.15 నుంచి 9.45 గంటల మధ్య మిథునలగ్నంలో ధ్వజారోహణం, రాత్రికి పెద్ద శేషవాహనం, 20వ తేదీ మంగళవారం ఉదయం చిన్నశేష వాహనం, రాత్రికి స్వామివారు వీణాపాణి, హంసవాహనంపై ఊరేగుతారు. 21న బుధవారం ఉదయం సింహవాహనం, రాత్రికి ముత్యపుపందిరి వాహనం 22వ తేదీ గురువారం కల్పవృక్ష వాహనం, ఆర్జిత కల్యాణోత్సవం, రాత్రి సర్వభూపాల వాహనం, 23న శుక్రవారం ఉదయం మోహినీ అవతారం, రాత్రికి గరుడ సేవ, 24న శనివారం ఉదయం హనుమంత వాహనం, సాయంత్రం వసంతోత్సవం రాత్రి గజవాహనం, 25న ఆదివారం ఉదయం సూర్యప్రభ, రాత్రి చంద్రప్రభ వాహనాలు, 26న సోమవారం రథోత్సవం, రాత్రి అశ్వవాహనం, 27 మంగళవారం ఉదయం పల్లకిసేవ, చక్రస్నానం, సాయంత్రం ధ్వజాఅవరోహణ కార్యక్రమాలతో ముగుస్తుంది.


వంద అడుగులకు పైగా ఎత్తు కలిగిన ధ్వజస్తంభం



ఆలయ ఆవరణలో రంగులు దిద్దుతున్న దృశ్యం, ముస్తాబవుతున్న వేణుగోపాలస్వామి ఆలయం

క్వారీ సమస్యను పరిష్కరించండి

నగరి: గుండ్రాజుకుప్పం దళితవాడ సమీపంలోని క్వారీ వల్ల ఏర్పడే సమస్యలను పరిష్కరించాలంటూ గ్రామస్తులు ఆందోళన చేశారు. గురువారం క్వారీ వద్దకు వెళ్లిన వారు ఆ ప్రాంతంలో షామియానాలు వేసి ఆందోళనకు దిగారు. సంఘటన స్థలానికి చేరుకున్న సీఐ ఆందోళనకారులతో చర్చించారు. క్వారీ వల్ల ఏ సమస్యలు ఏర్పడతాయో వివరాలు సేకరించారు. ఈసందర్భంగా గ్రామస్తులు ఆయనతో మాట్లాడుతూ క్వారీ నుంచి గ్రావెల్‌ను రోడ్డు పనులకంటూ ఎడాపెడా తరలించేస్తున్నారని వారు మండిపడ్డారు. ఈ కారణంగా పలు సమస్యలు ఏర్పడుతున్నాయని తెలిపారు. సీఐ స్పందిస్తూ క్వారీ వ్యవహారాన్ని తహసీల్దార్ దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. దీంతో ఆందోళనకారులు వెనుదిరిగారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
గంగాధర నెల్లూరు : 95539 55610
నగరి : 95539 55609